కర్త

నాకు చాలాకాలంగా నిద్రలేదు.

ముఖ్యకారణం నా రెండో కూతురు - సూరీడు - సూర్యప్రభ. దానికి నేనంటే ఎంత అసహ్యం!

నా ప్రతిమాటనీ అది తోసి పారేస్తుంది. ఇన్ని కష్టాలు పడ్డాను. ఏదో ఈనాటికి ఇంతపైకొచ్చాను. పదిమందిచేత ఔననిపించుకున్నాను. ఈరోజున ఎవడికైనా నా ఎదుటబడి మాట్లాడాలంటే కాళ్ళూ, చేతులూ వణుకుతాయి. మాట తడబడుతుంది.

అలాంటిది ఆ భడవకి ఎంతధైర్యం-

ముగ్గురు పిల్లలనీ సమానంగానే కన్నాను. పెద్దాళ్ళిద్దరూ - రాజ్యమూ, రాంబాబూ - నాముందు ఎన్నడూ నోరు విప్పలేదు. న్యాయానికి - ఆలశ్యంగా పుట్టిన పిల్లకనక పెద్దదానినే ఎక్కువ ముద్దు చేసాను. మగపిల్లాడు కనక వాడిని నేలమీద కాలుపెట్టకుండా పెంచాను. వాళ్ళిద్దరికన్నా, దీన్ని ప్రత్యేకంగా పెంచలేదు. ఇది పుట్టాకపట్టినదల్లా బంగారమయింది. అయినా నేనేం దాన్ని ఎక్కువ చెయ్యలేదు.

పెద్దాళ్ళిద్దరూ చక్కగా చదువుకున్నారు. పెళ్లిళ్ళు చేసుకున్నారు. వాళ్ళకేం తక్కువయింది? రాంబాబు ఫ్యాక్టరీ బ్రహ్మాండంగా నడుస్తోంది. వాడు రెండో యూనిట్‌కి స్థలం వెదుకుతున్నాడు. వాడి అత్తారికే తలబిరుసు. అయినా వాళ్ళదగ్గర ఉంటూనే, వాళ్ళని వంచుతున్నాడు. రాజ్యం మొగుడు గవర్నమెంటులో పెద్ద ఆఫీసరు. ఏడాది తిరిగేసరికి ఒక ఫ్లాట్ కొంటున్నాడు. దాని అత్తారు కొంచె చెడిబతికినాళ్ళు. మనుషులు ఎలా ఉండాలో - ఎంత హోషుగా ఉండాలో - తెలియని అడవిమనుషులు. ఆడాళ్ళకేం గావాలి - బంగారం. చెరిపించు కుంటారు. చేయించుకుంటారు. ఆమాత్రం ముచ్చట కూడా తీర్చలేరా? రాచి రంపాన పెడుతున్నారు. నీ బాబు దగ్గరికి వెళ్ళి చేయించుకోమంటారు.

ఏమాటకామాటే చెప్పుకోవాలి. మొగుడు బంగారం. దాని కొంగు పట్టుకు వదలడు. అలా మొగడు కాసుకోబట్టే, అది అక్కడ ఉంది.

ఏవో సంసారాలన్నాక, చిన్నాచితకా ఉంటాయి. నేను చెప్పినట్టల్లా విన్నారు. సుఖంగా ఉన్నారు. ఇది మొదటినుంచీ యింతే - నేనేం నాజూకుగా వదిలెయ్యలేదు. ఆడపిల్ల. వంచేలా వంచాలి. లేకపోతే ఎందుకూ పనికిరాకుండా పోతుంది. తెలుసు - అలాగే పెంచాను. కాని మానవులం కదా గుడ్డి ప్రేమ! ధృతరాష్ట్రుడంతటివాడిని వంచేసింది పిల్లల మీద ప్రేమ. నేనెంత!

అందుకే అలా తయారయింది.

తండ్రినని కూడా చూడకుండా - "నువ్వు మమ్మల్ని ప్రేమిస్తున్నాననుకుంటున్నావేమో! అంతా అబద్ధం. నిన్ను నువ్వు ప్రేమించుకుంటున్నావు. నీ ఆర్జనను ప్రేమించుకుంటున్నావు. నీ డబ్బుని చూసి, ప్రతివాళ్ళూ తలతిరిగి కాళ్ళమీద పడాలనుకుంటున్నావు. అందులో నువ్వు కన్నపిల్లలకి కూడా మినహాయింపు లేదు. అక్కయ్యనీ, అన్నయ్యనీ నువ్వు మనుషుల్లా పెంచలేదు. మరల్లా పెంచావు. వాళ్ళకి ప్రపంచంలో ఉన్న ఏ ఆనందమూ తెలీదు. ఏ విషాదమూ తెలీదు. నువ్వు నేర్పిన ఆనంద, విషాదాలే వాళ్ళకి తెలుసు. డబ్బుని తయారు చెయ్యటం, తయారయిన డబ్బుతో తమలోని శూన్యాన్ని నింపుకోవటమే తెలుసు. అది నీవు పెట్టిన భిక్ష. నీవు వారసత్వం - -" అనేసింది.

నేను తెల్లబోయాను. వాళ్ళమ్మ అడ్డుకుంది. తిట్టింది. దాన్నికూడా ఎన్నిమాటలంది!

"అమ్మా - నువ్వు పల్లెటూరిలో పుట్టావు. మట్టిలో పెరిగావు. పేడచేసి, పిడకలు చరిచావు. పశువులకి దాణా పెట్టావు. పాలు పితికావు. లేగదూడలతో ఆడుకున్నావు. పొలంలోకి వెళ్ళావు. నడుం వంచావు. నాట్లు నాటావు. అప్పటి ఆనందం - ఆ ఉత్సాహం - ఆ స్వచ్ఛత యీనాడు నీకున్నాయా? ఈ మనిషిని కట్టుకున్నాక, ఈయన వెనకాల పరుగెత్తావు. నీ భాషనీ, నీ వేషాన్నీ మార్చేసాడు. నీ మనసుని కూడా మార్చేసాడు. నువ్వీరోజున జీవిస్తున్నదే జీవితమనీ, నీ సుఖం, నీ క్లబ్బులూ నీ మహిళాసంఘాల అధ్యక్ష పదవులూ మాత్రమేననీ, నిన్ను నమ్మేట్టు తయారుచేసినది ఈయనే! ఈ మగవాళ్ళు మన మెదడుని చిత్రీపట్టి, వాళ్ళకి కావాల్సిన షేప్‌లో దాన్ని జేబులో ఉంచుకుని అదంతా తమ హోదాలో, ప్రదర్శనశాలలో ప్రదర్శనవస్తువుగా చూపిస్తుంటారు."

సూరీడు ఏమంటున్నదీ నాకే అర్థం అవలేదు. ఇంక వాళ్ళ అమ్మకేం అర్థమవుతుంది! వాదిస్తే లోకువవుతానని తెలిసీ, వాదించేను. లాభం లేకపోయింది. పూర్తిగా అదుపు తప్పిపోయింది. ఇంకొక్కటే మందు. పెళ్ళి. దెబ్బకి - అన్ని రోగాలూ కట్టేస్తాయి. ఆ ప్రయత్నమూ చేసాను. గట్టిగా మాట్లాడితే - యింట్లోంచి పోతానంది.

అదిరిపోయాను.

'పెళ్ళి వద్దంటుందేంట్రా--' అంటూ రాంబాబుతోనూ, రాజ్యంతోనూ మాట్లాడాను. వాళ్లమ్మతో మాట్లాడాను. 'నా కూతురేంటి - యీ మాటలేంటి - దీనికి ఏదో శనిపట్టింది --' అంది వాళ్ళమ్మ. అది ఏమిటో సులువుగానే తెలిసింది.

నా తమ్ముడి కూతురు మాలతే ఆ శనిగ్రహం. అది మరీ కంగాళీ వెధవలా తయారయిందిట. ప్రతీ కొంపలోనూ దూరి, 'నువ్వు పెళ్ళాన్నికొట్టావా నీవీపు చీరేస్తాను' అంటూ సంసారాల్లో చిచ్చు పెడుతోందిట.

ఆడపీనుగులకి చదువులట. స్వేచ్ఛట. హక్కులుట - అవన్నీ మా ఆవిడా చెపుతుంది ఉపన్యాసాలలో - అది ఈనాటి ఫేషన్. అయితే - కూలినాలి చేసుకుని, అడుక్కుతినే ఆడపీనుగులకి అవన్నీ నూరిపోస్తే ఎలా? ఈరోజు మొగుళ్ళని చావగొట్టమని ఉసికొలిపితే, రేపు వీధినబడి కనిపించిన ప్రతి మొగాడినీ కొట్టబోతారు. 'ఆడదాన్ని వీధిలోకి వెళ్ళనిస్తే, పదిమంది దగ్గర ఖచ్చితంగా పడుకుంటుందని' మా నాన్న అనేవాడు. అది నిజమే. పడుకుంటే ప్రమాదం ఏముంది-? మనవాళ్ళని వెళ్ళనీయకపోతే-అదీ మనకు లాభమేగదా-' అనుకునేవాడిని. అయితే వాళ్ళు పదిమందిని పట్టుకుని చావగొడితే మాత్రం ప్రమాదమే - అక్కడెక్కడో ఎమ్మెల్యేను పట్టుకుని కొట్టారు. సరే - లోకంలో ఏం జరిగితే నాకేం? అక్కడెక్కడో నిప్పంటే నాకేం నష్టం--? అది నా కొంపమీద పడినపుడు ఆర్పడం నా కర్తవ్యం.

నేనా ప్రయత్నమే చేసాను.

చేతిలో డబ్బులేని వెధవలు కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చెయ్యరు. అప్పుడు వాళ్ళు తిన్నగా ఉండరు. పెళ్ళిళ్ళయి అదృష్టమున్న వాళ్ళని చూసి, కళ్ళలో నిప్పులు పోసుకుంటారు. పెళ్ళీ వద్దు, పెటాకులూ వద్దు - అని వాగుతారు. పరాయి ఆడది ఏ చెత్త వాగినా, చుట్టూ చేరి, చప్పట్లు కొట్టే చిత్తకార్తె కుక్కలు మగ వెధవలు. ఆ చప్పట్లు విని, మరింత పేట్రేగిపోతారు ఆడపీనుగలు.

అందువల్ల అసలు రోగమంతా పెళ్ళి కాకపోవటంలో ఉంది.

ఆమాటే అన్నాను సూరీడుతో.

ఎంత నవ్వు నవ్విందది.

"అక్కకి పెళ్ళి చెయ్యి. నీ కాలికింద చెప్పులా ఉంటాను--" అంది.

ఆలోచనలో పడ్డాను. అదెంత పని! చిటికెలో చెయ్యొచ్చు. అయితే - కష్టపడి సంపాదించిన డబ్బు పై వాళ్ళకి దొబ్బబెట్టాలన్నదే అసలు బాధ!

తప్పదు - సూరీడుని ఓ దోవలో పెట్టాలంటే ఆ మాత్రం ఖర్చు పెట్టక తప్పదు. దాని జీవితానికి నేను కర్తనవుతాను. - నా పరువు నిలబడుతుంది.

"నువ్వా మాట మీద ఉంటావా--?"

"మాట తప్పటం నీ దగ్గర నేనేం నేర్చుకోలేదు --" అంది.

వెంటనే మా తమ్ముడికి కవురంపాను.

వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట. నేను అంతపని చెయ్యనక్కరలేదు. కుక్కకి బిస్కట్టు చూపెడితే చాలు - వెంటబడుతుంది.-

అదే అనుకున్నాను. మూడుకవుర్లు పంపినా ఆయనగారు రాలేదు.

ఎందుకొస్తాడు?

వాడికి నేనంటే మంట.

ఎదుట పడటానికి నామోషీ. పడితే, పలకరించటానికి ఏడుపు.

ఎందుకంటే ఏం చెప్పను? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఏడుపు గొట్టు వెధవలకి డబ్బుయ్యొక్క కారణాలు. చివరకి మా అమ్మా, నాన్నా నన్ను ముందు కన్నారని కూడా ఏడుపే!

సమానంగా కన్నారు. సమానంగా పెంచారు. సమానంగా - ఉన్న భూమిని పంచారు. వాడు బాగుపడలేదు. నేను పడ్డాను.

నేను కష్టపడ్డాను. భగవంతుడు కలిసొచ్చాడు. ఈరోజున నాకు ఒక సినిమాహాలుంది. రెండు లారీలున్నాయి. ఒక క్లాత్‌షాపుంది. ఏదో ఓ కొంప కట్టుకున్నాను. నాకు మాత్రం లోకంలో అందరికన్నా ఎక్కువ ఆస్తి ఉందా? ఉన్న దానితో తృప్తిపడే స్వభావం ఉంది. అదే అసలు ఆస్తి. లేనిదానికోసం ఏడిచే అలవాటు లేదు. అందుకే యీరోజు ఏదో యిలా ఉన్నాను.

వాడు మొదటినుంచీ మొద్దు రాచ్చిప్పే. ఒళ్ళొంచి పనిచేసే అలవాటు లేదు. అందుకే యీరోజున ఫ్యాక్టరీలో కూలి వెధవలా పనిచేస్తున్నాడు. నన్ను చూసి ఏడుస్తాడు.

వాడికోసం నేను ఎంత కష్టపడ్డాను. - ఎన్ని ప్రయత్నాలు చేసాను. - అవన్నీ ఎందుకు గుర్తుంటాయి.

మా నాన్న పోయినా, ఆయన అన్నీ పంచేసినా, నేను వాడిని వదలలేదు. ఉమ్మడి వ్యవసాయం చేసాము. అన్నీ నాకు అప్పజెప్పి, సినిమాలూ సరదాలూ అంటూ బలాదూరు తిరిగాడు. నేనేనాడూ వాడికి అడ్డు తగిలిన పాపానపోలేదు. అయినా, ఓ వయస్సు వచ్చిన వాడికి, ఎంత అన్నగారయినా, చెప్పడం చెప్పిచ్చుకుని ఆ దవడా యీ దవడా వాయించుకోవడమే! ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. నాకు చెప్పుదెబ్బలు తినేపాటి త్యాగబుద్ధి లేదు. చెయ్యాల్సిన సాయం చేసాను. పద్దులు అన్నీ కరెక్టుగా రాసాను. అయినా వాడిది అయిదెకరాలు కరిగిపోయింది. అమ్మనీ, వాడినీ కూర్చోబెట్టి మనలాంటి వాళ్ళం వ్యవసాయానికి పనికిరామన్నాను. ఉన్నదంతా అమ్మేసాను. పట్నం చేరాము. మా ఆవిడ పుట్టింటి

వాళ్ళనడిగి ఏదో తెచ్చుకుంది. మూడువాటాలు వేసుకుని హోటలు పెట్టాము. వాడిని గల్లా పెట్టి దగ్గర కూర్చోబెడితే అంతా గల్లంతే! అందుకని కిచెన్‌లో ఉండమన్నాను. అక్కడైనా వాడు సరుకులనీ, వంటవాళ్ళనీ, సర్వర్లనీ అజమాయిషీ చేయొచ్చుగదా - ఎవడేం మోసేస్తున్నాడో - ఎవడేం మేసేస్తున్నాడో - చూసుకోవచ్చుగదా - అబ్బే అలా ఎందుకు చేస్తాడూ? చెయ్యలేదు. మా అమ్మని నామీదకి ఎగసన దోసాడు. ఆవిడ చేత నానా మాటలూ అనిపించాడు. నేను నా పెళ్ళాం పేర ఆస్తులు కొంటున్నా నన్నారు. ఎన్ని కుళ్ళు మాటలు అన్నారు! పడ్డాను. పడ్డాను. ఎవరయినా, ఎన్నాళ్ళు పడతారు? మీ దోవ మీరు చూసుకోండన్నాను. లెక్కలు తేల్చాను. నా తల తిరిగిపోయింది. వాడే నాకు చాలా యివ్వదేలాడు. ఆరోజున నా భార్యది దొడ్డబుద్ధి కనక పోన్లెండని వదిలేసింది. వాడికి ఆ కృతజ్ఞత కూడా లేదు.

ఎవరి దోవ వాళ్ళు చూసుకున్నాం.

గొడ్డొచ్చిన వేళా, బిడ్డొచ్చిన వేళా అన్నారు. వాడికి మొదటి కూతురు పుట్టేసరికి ఉన్న భూములు పోయాయి. ఉన్న ఊరు విడిచి పట్నం చేరాం. మూడో కూతురు పుట్టింది. హోటలు వ్యాపారం ఎత్తి కట్టించేసింది. మోహమోహాలు చూసుకోకుండా చేసేసింది.

వాడు అంతచేసాడు. అన్ని మాటలు అన్నాడు. అయినా నేనెప్పుడూ మనసులో పెట్టుకోలేదు. అమ్మని నా గడప కూడా తొక్కకుండా చేసాడు. ఆవిడపోయినప్పుడు అయినా సరే - నేనే నిలబడ్డాను. నాకు పిల్లలు పుట్టడం ఆలశ్యమయింది. యింట్లో ప్రతీకార్యానికీ పిలిచాను. పీటవేసి కూర్చోబెట్టాను.

ఈనాడు నేను మూడు కబుర్లు పంపినా రాలేదు. ఎప్పుడొచ్చాడు గనక!

మండిపోయింది.

చిన్న పిల్లతో పంతానికి పోయాను. ఏదో సాయమవుదామనుకున్నాను - ఆ నెపాన అయినా-!

ఆఖరికి ఓ రోజున చలిలో, రాత్రివేళ, రోడ్డుమీద పడిగాపులు పడి ఉన్నాను. రాత్రి పదవుతోంది. ఇంకా యింటికి అఘోరించలేదుట. ఫస్ట్ షిఫ్టట. డ్రైవరు వచ్చి చెప్పాడు. ఉండి లేదనిపించుకున్నాడా -?

కార్లో కూర్చుని చూస్తున్నాను. ప్రతి అలగా వెధవనూ చూసి వాడే అనుకోవడం - తీరా కాకపోవడమూనూ -!

చివరకి దొరికాడు.

డ్రైవర్ వెళ్ళి పిలుచుకొచ్చాడు. లోపలికి రమ్మన్నాను. నా తప్పులేదు. వాడే రాలేదు. వదిలించుకుందామని చూసాడు. యోగక్షేమాలతో సరిపెడదామని చూసాడు. బయట నిలబడి, కారులో వాళ్ళతో మాట్లాడి, నలుగురికీ కనపడదామని గాబోలు - వాడి ఊహ. చికాకేసింది. కాని జాలి కూడా వేసింది.

"మాలతి పెళ్ళి ఏంచేసావ్?" సూటిగానే అడిగాను.

ఎప్పుడయినా చూపులు కలపడం వచ్చా-వాడు ఆశ్చర్యపోయాడేమో - ఎలా తెలుస్తుంది! మాసిన గడ్డంతో మండ మీద గోక్కున్నాడు. ఖాకీ చొక్కా మీద ఆయిలు మరకలు. కళ్ళకింద మసో - నల్లదనమో-!

వాడి వాలకానికి చాలా కోపం వచ్చింది.

దరిద్రం మండిపోతోందా - ఓ సబ్బు ముక్క కొనుక్కుని, హాయిగా కడుక్కుని ఫ్యాక్టరీ నుంచి వచ్చేటప్పుడు చక్కని బట్టలు వేసుకోవచ్చుగదా -

మరోసారి రెట్టించాను అదే ప్రశ్నను

"దేనికి మనం కర్తలం -?"

"మెట్ట వేదాంతాలొదిలెయ్! కన్నపుడుండాలి ఆ బుద్ధి. ఏదో చెయ్యాలి. తల తాకట్టుయినా పెట్టాలి."

"ఎవడు పడతాడు?"

మోహం మీద చరిచినట్టుందా ప్రశ్న. ఎప్పుడూ నా ముందు నోరు విప్పలేదు. వాడి తరపున అమ్మే పోట్లాడేది. ఎప్పుడయినా నోరు విప్పాడా - నేను భుజాలు తడుముకుంటున్నానా - అయినా నేనేం చేసానని!!

"నువ్వు యింటికిరా - నీకు బాధ్యత లేకపోయినా నాకుంది."

"పొదయిపోతోంది - మళ్ళీ పొద్దుటే లేవాలి."

"కబుర్లు చెప్పక! షిఫ్ట్ డ్యూటీ కదా - పొద్దుటే లేవటమెందుకూ?"

"పేపర్లమ్ముతున్నాను"

"ఏం చేస్తున్నావా సంపాదనంతా - దానికి పెళ్ళి చెయ్యకుండా-"

"-----"

"నువ్వు రావల్సిందే----"

"రేపు షాప్‌కి వస్తాను"

"ఇంతకు ముందూ అలాగే కవురంపావు."

"-----"

"అయితే నువ్వు రానంటావు - యింటికి."

"-----"

"నేను పూర్వకాలం వాడిని. నన్ను ఎడపెడుతున్నావు. కాని, నాకు చెమా బెమా ఉన్నాయి. గంతకు తగ్గ బొంత. ఎవరినో ఒకరిని చూడు. మిగిలిందంతా నేనే చూసుకుంటా---!"

వాడు నా మొహంలోకి చూసాడు. అలా చాలామంది చూసారు. వాడు అలా ఎన్నడూ చూడలేదు. కంగారుపడ్డాను. అణచుకున్నాను. వాడిచేతిని నొక్కాను.

"మాలతికి పెళ్ళవ్వాలి అదబ్బాయ్! నాకు కావాలి"

"నువ్వీ మాట అంటావని ముందే అంది."

ఆ విషయం సూరీడు చెప్పింటుందా! మండిపోయింది. ఈ ముష్టి వెధవకి కూతురు నేర్పిందన్నమాట! పిదపకాలం. తండ్రులకి పిల్లలు నేర్పుతున్నారు.

అదనూ పదనూ ఎరిగినవాడిని కనక అణచుకున్నాను.

"తెలివయిన పిల్ల. దానికి నా సంగతి తెలవదా నా మంచితనం పోల్చుకుంది. వెంటనే సంబంధం చూడు."

"అలాగే" --- కదలబోయాడు.

"ఆగాగు - ఎప్పుడు చూస్తావ్?"

"సూరీడుకి పెళ్ళయ్యాక"

"అది చిన్నదిరా - నీకు మతిగాని బోయిందిరా-"

"రాజ్యమూ చిన్నదే రాముడూ చిన్నాడే---"

అమ్మ! వీడికీ ధ్వనించటం వచ్చన్నమాట. దానిని గమనించనట్టు అన్నాను.

"నీ అంతట నువ్వు కదులుతావేమోనని చూసాను. ఇదిగోరా అన్నయ్యా - ఈ సంబంధం చూసా - నువ్వు మొయ్యక తప్పదు - అంటావేమో అనుకున్నాను. కావాలంటే వదినని అడుగు - నువ్వు రాలేదని ఎంత బాధపడ్డానో చెపుతుంది. రాముడు అమెరికా నుంచి వచ్చాడు. ఫ్యాక్టరీ పెట్టాలనుంది. వాడికి పిల్లనిస్తామన్న వాళ్ళు పెడతామన్నారు. ఒప్పేసుకున్నాను. ఒప్పుకున్నాక ముహూర్తాలన్నారు. తప్ప లేదు. రాజ్యం అంటావా - ఆ మూడు లక్షలు యిచ్చి, మరో రెండు చూసుకొనేసరికి ఎన్ని పాట్లు పడ్డానో ఆ మూడో కంటికి వాడికి తెలుసు. ఇప్పుడు చెయ్యి వెసలుబాటయింది. అందుకే నువ్వు ముందుకి రాకపోయినా - నాకు తప్పలేదు."

"సరే మాలతిని అడుగుతాను. ఒప్పుకుంటుందని నమ్మకం లేదు."

"ఏం చేస్తుంది - పెళ్ళాడక?" మిగిలిన వాక్యాలు తొక్కేసాను.

"దాని దృష్టిలో చాలా ఉన్నాయిట"

"ఏమిటో - ఆ - చాలా?"

"సమాజంలో చాలా సమస్యలున్నాయిట."

అవును తండ్రీ - చాలా ఉన్నాయి. నా పీకకి ఉచ్చువెయ్యడం కూడా ఒకటి.

"అవునబ్బాయ్ - సమాజానికి అందరూ సేవచేయాలి. నేను చెయ్యటం లేదా.? మీ వదిన చెయ్యటం లేదా? - దానిగురించి పేపర్లలో చదివే ఉంటావు. సూరీడు పద్యాలు గట్రా రాసి పుస్తకం వేసింది - అవార్డు కూడా యిచ్చారు. - అందుకోసం పెళ్ళి మానేస్తుందా - ఈ రోజు సంబంధం చూస్తే రేపు పీటల మీద కూర్చుంటుంది."

"మాలతీ మానతాననటం లేదు."

"ఇంకేం చేసెయ్యి."

"దాని పెళ్ళికి నేను కర్తని కాదుట."

దొరికాడు. గొంతులో బాధ ఉంది. కూతురు ఎన్ని పాఠాలు చెప్పినా రక్తంలో జీర్ణించుకున్నవి ఎలా పోతాయి.? ఏ తండ్రికయినా పిల్లలు నువ్వు కర్తవి కాదంటే ఒప్పేసుకోడానికి యిదేమయినా ప్రాశ్చాత్యదేశమా? ఇనుమువేడి ఎక్కినప్పుడే సాగగొట్టాలి.

"బాధ పడకురా - పెళ్ళిఅవదన్న బెంగ. చిన్నతనం. అలాంటపుడే అన్ని రకాల పిచ్చులూ వస్తాయి. లేకపోతే - మన రక్తం పంచుకుపుట్టిన పిల్ల ఏంటి - అలాగా ఆడాళ్ళను వెంటేసుకుని సారా కొట్లమీద పడటమేంటి-? పేపర్లకేం పనుంది -? ప్రతిదీ అబ్బురమే - న్యూసే! ఫోటోలు తీస్తారు. వేస్తారు. దానితో అవుతుందా? కుటుంబానికి ఎంత అప్రదిష్ట. నేనే కట్నం గిట్నం యిచ్చి పెళ్ళి చేస్తానంటే - నువ్వది నమ్మేలా చెపితే ఎగిరిగంతేస్తుంది - వెళ్ళి, చెప్పు."

అంతా విన్నాడు. మాట్లాడలేదు..

"ఏమంటావ్."

"నేనేమీ చెప్పను. నీకన్నా, నాకన్నా మన పిల్లలు తెలివయినవాళ్ళు. వాళ్ళ మంచి చెడ్డలు వాళ్ళకే బాగా తెలుసు."

పేలిపోయాను.

"అవునవును బాగా తెలుసు. ఎందుకు తెలియదు. నిన్నటి దాకా మగాళ్ళ పెత్తనం పనికిరాదని గెంతారు. ఈ రోజు సారావద్దు, గాడిద గుడ్డువద్దూ అంటూ పూనకం పట్టినట్టు ఆడుతున్నారు. రేపు ఈ ప్రభుత్వమే వద్దూ - ఈ సైన్యాలొద్దూ - ఈ సరిహద్దులొద్దూ - అంటారు. ఏ కొండల్లోనో దిక్కులేని చావు చస్తారు. అప్పుడు బాగా తెలుస్తుంది."

నా మాటలింకా పూర్తవలేదు.

"ఎవరి కర్మకి వాళ్ళే కర్తలు" అనేసి వెళ్ళిపోయాడు.

"పద! యింటికిపోనీ" అంటూ డ్రైవర్ని కసిరాను.

కారు వెనక్కి తిరిగింది.

ఎవరి కర్మకి వాళ్ళు కర్తలుట.

ఏమిటి వాడి ముదలకింపు? నేను చేసుకున్నదానివల్ల నా కూతురు యిలా తయారయిందనా?

తన కూతురు తన చెయ్యి జారిపోయిందని ఏడుపా? మెట్టవేదాంతమా!

సూరీడుతో జరిగినది చెప్పలేదు.

నేను చెప్పకపోతేనేం? వాళ్ళెలాగా చెపుతారు. అందుకే ఆ లోకువ నవ్వులు. దాన్ని అలా తయారుచేసి, నావాళ్ళే నామీద కసి తీర్చుకున్నారు. తెలుసు. నేనేం జెయ్యాలని ఆలోచిస్తూనే ఉన్నాను.

సూరీడు ఇచ్ఛారాజ్యంగా తిరుగుతోంది. సారా వ్యతిరేకోద్యమం గురించి పేపర్లు తెగరాస్తున్నాయి. ఇదంతా నిజమనుకునేపాటి తెలివితక్కువ వాళ్ళు లేరు. స్వతంత్రోద్యమమూ, ఆ ఊపు, ఆ గోలంతా వేరు. ఆ తరువాత అన్నీ పేపర్లమాయే. పదిమంది జనాన్ని కూర్చోబెట్టి, లక్షమందిగా ఫోటో తీయగలరు. పాతికమంది కూడితే, పాతికలక్షల మంది అని నమ్మించగలరు. సారాట. వ్యతిరేకంట. ఉద్యమంట. ఏమయితేనేం ఆ శనిగ్రహంతో చేరి నా బంగారం లాంటి కూతురు ఎక్కడెక్కడికో వెళ్తోంది. వివరంగా తెల్సుకోవాలంటే - తండ్రిని గదా - భయంతో గుండె పిడచకట్టుకుపోతోంది. మా సర్కిల్స్‌లో కూడా నర్మగర్భంగా ఏవో అంటూనే ఉన్నారు. నిజమే ఇలా పదిమందిని పోగేసి తిరుగుతూండేవాళ్ళకు రెండుప్రమాదాలు. పోలీసులతో ఫరవాలేదు. ఏలాగోలా నప్పించవచ్చు. ఫలానీవాడి కూతురని గుర్తుంచుకుంటారు. పాపం - అంతేసి డబ్బుపోసి, పాటలు పాడి, సారా వ్యాపారం చేసేవాళ్ళకు లక్షాతొంభై తలనొప్పులు. అవన్నీ ఓ పక్క అలా ఉంటే, మొదటికే మోసం తెస్తామని యీ ఆడపీనుగులు తైతక్కలాడితే వాళ్ళకు ఎంత బాధ! ఎవరయినా ఏం చేస్తారు. తప్పనప్పుడు తప్పించేస్తారు. నేనయినా అంతే. నువ్వయినా అంతే. ప్రాణ రక్షణకోసం ఏ జంతువయినా అదే జేస్తుంది. వాళ్ళు ఆ పని చేస్తారేమో - నా బిడ్డ నాకు కాకుండా పోతుందేమోనని భయం. భయం.

అన్నింటికీ నువ్వే కర్తవి. నువ్వే భర్తవి. నేను సామాన్యుడిని. నాకు అంత త్యాగబుద్ధి లేదు. ఈ ఉద్యమానికి బలి తప్పకపోతే - నా తమ్ముడి కూతుర్ని తీసుకో. వందలూ, వేలూ చీమల్లాంటి ఆడవాళ్ళున్నారు. వాళ్ళందర్నీ బలితీసుకో. నా కూతుర్ని మాత్రం రక్షించు' - అంటూ భగవంతుడిని ప్రార్థించాను. డాక్టర్ చెప్పిన లిమిట్స్ దాటి తాగాను.

నిజంగానే నమ్మిన వాళ్ళను భగవంతుడు దగా చెయ్యడు. పరిశుద్ధ హృదయంతో ప్రార్థిస్తే తప్పక మన్నిస్తాడు. సారా కాంట్రాక్టర్ల మనసులలో దూరాడు. సూరీడుమీద ఈగ వాలనివ్వలేదు. మాలతికి కూడా ఏమీ అవలేదు. - అంతటితో అయిందా - ఈ ఆడాళ్ళగోల ప్రభుత్వాన్ని కదిపేసింది. సారా నిషేధించారు. మా అమ్మాయి గురించి అందరూ గొప్పగా చెప్పుకుంటున్నారు. అఫ్‌కోర్సు - మాలతిలాంటి వాళ్ళకి కూడా అంతోయింతో గుర్తింపు వచ్చింది.

భగవంతుడు ఎంత దయామయుడు!

ఇంతకాలం అందరూ మా సూరీడు గురించి నా వెనుక సణుక్కునేవారు. పిల్లల్ని అదుపులో పెట్టుకోలేనివాడు 'వీడేం పెద్దమనిషి?' అన్నట్లుండేవారు. అలాంటి వాళ్ళను భగవంతుడు ఎంత మార్చాడు. అందరూ నన్ను అభినందిస్తున్నారు.

అయినా నాకు సంతోషమేం లేదు. పిల్లకి ఆపద రాలేదన్నదొకటే సంతోషం. అంతకుమించి అది నన్ను తోసిపారేసిందని, తన జీవితాన్ని తగలేసుకుంటోందని, అందరిలాగా ఉండటంలేదని, లోలోపల ఉన్న బాధ ఎలా పోతుంది! నిద్ర ఎలా పడుతుంది.

దానికి కూడా ఆ సర్వశక్తిమంతుడు మార్గం చూపించాడు.

ఆ రోజు నా మిత్రులు నాకు ఒక సంతోషకరమైన వార్త చెప్పారు. మా సూరీడు సైగ చేస్తే చాలు నిప్పుల్లోకి ఉరికేస్తారట జనం. అటువంటి జనాకర్షణ ఉన్న ఫైర్‌బ్రాండ్‌లను ఏ రాజకీయపార్టీ వదులుతుంది. పదిమందిని తన్ని, వెయ్యి మందిని భయపెట్టగలిగే నేరస్తులనే ఎవరూ వదులుకోరు. ఏదోలా ప్రజలలో పేరు తెచ్చుకున్నవాళ్ళని ఎవరు వదులుకుంటారు. అందువల్ల మా అమ్మాయితోపాటు ప్లాట్‌ఫారం పంచుకోవాలని ప్రతీవాళ్ళూ ఫీలర్లు పంపుతున్నారట! ఇప్పుడు జాగ్రత్తగా ప్లాన్‌చేసుకుంటే మా అమ్మాయికి తిరుగులేదుట.

మా అమ్మాయి చెప్పకపోయినా వాళ్ళంటున్నది నిజమే అయుండాలి. అంటే మా అమ్మాయి దోవలో పడుతున్నదన్నమాట. ఎవరు మాత్రం ఆ టెంప్టేషన్ని తట్టుకోగలరు. ఆ తర్వాత దాని రోగాలన్నీ వాటంతట అవే కట్టేస్తాయి. పెళ్ళికేముంది ఎవరినోఒకరిని కట్టుకుంటుంది. ఏదో ఒకటవుతుంది. అలా ఉండిపోదుగదా! పెళ్ళి విషయంలో దాని బ్రతుకుకి నేను కర్తనని ఒప్పుకోక పోవచ్చు. ఇలాంటి ఆఫరేవస్తే దానంతట అది పరిష్కరించుకోగలదా?

ఆ మాత్రం, యీ మాత్రం నోరున్న వాళ్ళు రాజకీయాలలో ఎక్కడవేసిన గొంగళ్ళలా అక్కడ ఉండిపోరుకదా! మంత్రి ప్రమోషనూ రావొచ్చు. ముఖ్యమంత్రీ అవొచ్చు. ఉద్యోగంలో ప్రవేశించాలిగానీ, కెరీర్ నిర్మించుకోవటానికి ఎంత ప్రొఫెషనలిజమ్ కావాలి. అదంతా, వ్యాపారుల దగ్గరనుంచి నేర్చుకోకపోతే ఎక్కడనించి నేర్చుకుంటారు.

ఇన్నాళ్ళూ ఆ మాలతి దీన్ని నడిపింది. ఇప్పుడది నడపగలదా? అసలు యిద్దరూ కలిసినడవగలరా? భుజం భుజం కలిపి పెద్ద గొప్పగా పోరాటాలు చేసిన వాళ్ళే ఫలితాలు పంచుకోవటంలో పావలా డబ్బులు కోసం, కాస్తంత కీర్తికోసం విడిపోలేదా? వీళ్ళెంత! తప్పకుండా విడిపోతారు.

అలా విడిపోయిన రోజున, దానికి వాళ్ళ నాన్నే గతి. నా కూతురికి నేనేగతి! కల్యాణ వేదికమీద నన్ను కర్తగా తిరస్కరించినా, ప్రజావేదిక మీద నేను కర్త కాకుండా ఎలా ఉంటాను. మెట్లు ఎక్కటంలో నా చెయ్యి పట్టుకోకపోతే, ఎవరి చెయ్యి పట్టుకుంటుంది. ఏదోరోజున అది నిండు సభలో 'మా తండ్రిగారు నన్ను కన్నారు. పెంచారు. ఏ రోజునా అభివృద్ధికి అడ్డురాలేదు. నన్ను నడిపించారు. నిలబెట్టారు.' అనకుండా ఉంటుందా? ఆ మాట నేను విన్నా, మానినా లోకం వినకుండా ఉంటుందా?

అలా ఆ భగవంతుడు కారు చీకటిలో ఓ కాంతిరేఖని చూపి, నాకు నిద్రపట్టేలా చేసాడు.

('ఆహ్వానం' మాసపత్రిక - జూన్, *1994*)